ఇంటర్వ్యూకొచ్చిద్దరే ఇద్దరు
పోస్టుమాత్రం ఒక్కటే—
లేడీ టైపిస్టు ఉద్యోగం—
టైమవుతోంది

ఇంటర్వ్యూ అయిపోగానే క్యాంపు వెళ్లాలి.

"వీరన్నా"—

"సార్".

"ఆ వరలక్ష్మిని లోపలికి పిలువ్"

లోనికొచ్చి గాభరాగా నిల్చోంది వరలక్ష్మి.

"అలా కుర్చీలో కూర్చోండి".

కూర్చుంది బిత్తరపడుతూ.

"మీ పేరు?"

"వరలక్ష్మి"—

"టైపింగ్ పాసయి రెండేళ్ళయింది. ఏమి చేస్తూండేవారు ఇంతకు క్రితం?"

— — .

"మీ కిదివరకు ఏమైనా ఎక్స్‌పీరియన్స్ వున్నదా?"

"లేదు సార్".

"ఏం"—నా అర్థంలేని ప్రశ్న.

"ఎక్కడా దొరకలేదు సార్".

ఎక్కడో చూచిన ముహం—

నే నిదివరకు చూచినదే.

ఆ మెరిసే కళ్లు—

నా ఆలోచనలన్నీ గతంలోకి—

చూపు వరలక్ష్మిని పరికిస్తూన్నది.

అమ్మయ్య. తెలిసిపోయింది.




అడుగు తగిలింది.

ఆ అమ్మాయి అప్లికేష న్నొకసారి తిరగేశాను.

తండ్రి పేరు : రాఘవులు.

వృత్తి: వాచ్‌మన్.

అవును, సందేహం లేదు.

నేను హాస్టల్లో వుండి చదువుకొన్న రోజుల్లో, హాస్టల్ వాచ్‌మన్ రాఘవులి అమ్మాయే, ఈ వరలక్ష్మి.

ముడి విడిపోయింది.

అందరికీ తలలో నాలికగా వుండిన రాఘవులు.

నే నొకసారి జబ్బుపడితే రెప్పపాటు లేని రాత్రు లిరవయి గడిపిన రాఘవులు.

చేసిన సేవకు బదులుగా

నాలుగు పదిరూపాయల నోట్లిస్తే

ముందుకు చాచని చేతుల్లోని

ఆత్మాభిమానం—

అంతా కళ్ళముందు మెదిలింది,

"వరలక్ష్మి, రాఘవులెలా వున్నాడు?"

"చనిపోయాడు సార్ నిరుడు కలరాతో"—

ముద్ద గట్టుకుపోయిన జవాబు.

"అయితే మీకిప్పుడు ఆధారం?"

నేల చూపించింది వరలక్ష్మి.

నా కళ్లు వరలక్ష్మి చీరమీద—

ఆలోచనలన్నీ వాళ్ళ ఆర్థిక పరిస్థితి మీద,

అదే! వరలక్ష్మి కట్టుకున్న గులాబీ రంగు షిఫాన్ చీర. సుశీల అలిగినాకూడా కొనడానికి నాకు ధైర్యంలేని యాభై రూపాయల చీర.

మరి, ఈ పిల్ల అంత ఖరీదయిన చీర ఎలా కొనుక్కుంది. అంత డబ్బెక్కడిది వీళ్ళకు?

కొంపముంచి, వరలక్ష్మి మరేవిధంగానైనా (?) సంపాయిస్తూందేమో!

ఛీ, ఛీ రాఘవులు బిడ్డలెప్పటికీ అలాంటి అవినీతికరమైన పనులు చేయరు—

సరిపెట్టుకొన్నా న్నేను.

కానీ,

నా సందేహం తీరడంలేదు

గోడ గడియారం ఠంగున పన్నెండు కొట్టింది.

వరలక్ష్మి తడబడిపోయింది.

"కూర్చోండి, కాఫీ తెస్తూంటాడు వీరన్న".

"క్షమించండి సార్. త్వరగా వెళ్ళి లాండ్రీలో ఒంటిగంట లోపల చీర ఇచ్చేయకపోతే, అద్దె ఎక్కువ కట్టాలి".

నా వీపుమీద కొరడా ఝళిపింపు.

వరలక్ష్మి వెళ్ళిపోయింది.

